నేడూ ఆస్తిపన్ను చెల్లించొచ్చు: డీసీ

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను చెల్లింపుదారుల కోసం ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఈ నెల 20వ తేదీతో పాటు 27వ తేదీన ఆదివారం సందర్భంగా కార్యాలయంలో ఈ కౌంటర్ పని చేస్తుందన్నారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ స్కీమ్‌ను ప్రకటించిందన్నారు. ఈ స్కీమ్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయతీ పొందాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాజేంద్రనగర్‌సర్కిల్ కార్యాలయంతో పాటు వార్డు కార్యాలయాల వద్ద ఆస్తిపన్నులు స్వీకరిస్తారన్నారు. బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సైతం ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ఆస్తిపన్నును వసూలు చేస్తారన్నారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ ఆస్తిపన్నును చెల్లించవచ్చునని కోరారు.

నేడు కోట మైసమ్మ ఆలయం వార్షికోత్సవం

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని కోట మైసమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవాలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలు, దేవాలయం వద్ద రంగురంగుల విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకం అనంతరం అలంకరణతో మొదటి వార్షికోత్సవ పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూజ కార్యక్రమాలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. మధ్యాహ్నం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా దేవాలయం వద్ద తగు ఏర్పాట్లు చేపట్టామన్నారు.

సమస్యలపై ఎన్ఐఆర్‌డీపీఆర్ ఉద్యోగుల వినతి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో అకడమిక్ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎన్ఆర్‌డీపీఆర్ చెర్మన్, స్టాండింగ్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు గ్రాంట్ నిలిపివేయడంతో నెలకొన్న ఆందోళనలపై చర్చించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించేలా చూడాలని కమిటీ సభ్యులకు వినతి పత్రం సమర్పించారు. పెన్షనర్లు, ఉద్యోగులు ఆందోళన చేస్తారని అధికారులు ముందస్తుగా పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భాగ్యనగర్ విభాగ్‌లోని శ్రీ శారదా ధామం ప్రాంగణంలోని శ్రీ విద్యారణ్య ఇంటర్ నేషనల్ స్కూల్‌లో ప్రముఖ కంటి వైద్యశాల ఈశ్వర్ ఐ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కంటి వైద్య నిపుణులు డాక్టర్ కీర్తి హాజరై విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు కంటి సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతి చిన్న వయస్సులోనే కంటి సంబంధిత సమస్యలతో చిన్నారులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు 1200 మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యారణ్య ఇంటర్ నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఈశ్వర్ హాస్పిటల్స్ కంటి వైద్య నిపుణులు, వైద్య బృందం పాల్గొన్నారు.

నీటి అక్రమ వినియోగాన్ని అరికట్టండి

మణికొండ: హైదరాబాద్ నగరానికి నీటిని సరఫరా చేస్తున్న గండిపేట క్యాండూట్‌కు లీకేజీలు, పైపులు వేసుకుని ఇష్టారాజ్యంగా నీటిని వాడుకుంటున్నా పట్టించుకునే వారు లేరని, దానిని అరికట్టాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. శనివారం గుడ్‌మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా సెక్రటేరియట్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నీటి ట్యాంకర్ల వారు ఫిల్లింగ్ కేంద్రం వద్ద వేగంగా నడపటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారన్నారు. అదే విషయాన్ని జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఎ.లక్ష్మణ్‌రావు, బి.బాబు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, సుమనళిని, బి.శ్రీధర్ తదతరులు పాల్గొన్నారు.




కూలిన చెట్లతో వాకర్ల పరేషాన్



మీరాలం చెరువు వాకింగ్ ట్రాక్‌పై పక్కనే ఉన్న చెట్లు శుక్రవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి నేలకూలాయి. పదికి పైగా చెట్లు గాలికి వాకింగ్ ట్రాక్‌పై కూలిపోయాయి. దీంతో శనివారం ఉదయం వ్యాయామం కోసం వచ్చిన వాకర్స్ ట్రాక్‌పై కూలిన చెట్లతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. వాకింగ్ చేసేందుకు తాము ఇబ్బంది పడాల్సి వచ్చిందని వాకర్స్ విచారం వ్యక్తం చేశారు. కూలిన చెట్లను యుద్ధప్రాతిపదిన తొలగించి వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

– శాస్త్రిపురం

పౌష్టికాహారంతోనే పరిపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ శాంతిశ్రీ



చిన్నారులకు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: పౌష్టికాహారంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. మండలంలోని పాల్మాకులలో శనివారం పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం సెక్టార్ పరిధిలోని చిన్నారులకు సామూహిక అన్నప్రాసనం, అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సంప్రదాయ వంటకాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పిల్లల అభివృద్ధి పరిశీలన కార్డులను అందజేశారు. కార్యక్రమంలో బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉస్మాన్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు వి.మోహన్‌రావు, సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ సునీతదేవి, అంగన్‌వాడీ టీచర్లు కవిత, ప్రేమలత, సుమలత, అరుణ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కార్తీక్‌రెడ్డి



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

మణికొండ: తెలంగాణ రాష్ట్ర సాదనే ధ్యేయంగా ప్రారంభమైన బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని, అందుకు ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన సీజన్స్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ... సుదీర్ఘ పోరాటం, దేశంలోని అనేక పార్టీలను ఒప్పించి రాష్ట్రాన్ని సాధించి అన్ని రంగాలలో మొదటి స్థానంలో నిలిపి ఘనత బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని అన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాలలో రాష్ట్రం అభివృద్ధి సాధించగా ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో వెనకటి రోజులు గుర్తుకు తెస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోవటంతో చేసేందుకు పనిలేక ఎంతో మంది వృథాగా కాలం గడుపుతున్నారన్నారు. అమలుకు సాధ్యం కాని అనేక హామీలను ఇచ్చి ప్రజలకు మొహం చూపలేని స్థితిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారన్నారు. ఈ విషయాలన్నింటిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘంగా బహిరంగ సభలో మాట్లాడతారన్నారు. పెద్ద ఎత్తున తరలివెళ్లి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రణాళికతో పనిచేద్దామన్నారు. పార్టీ నాయకులు వరదాచారి, సంతోష్, వేణు, నిజాముద్దీన్, ఫరూఖ్, గణేష్, మహమ్మద్, శ్రీకాంత్‌రెడ్డి, దాసు, నరసింహా, ఆనంద్, ప్రియదర్శిని, మహేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ వారు సంయుక్తంగా తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బండ్లగూడ జాగీర్‌లో శనివారం ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆఫ్ బీజేఎంసీ, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసేమియా అనేది ఒక వ్యక్తిలో వారి తల్లిదండ్రుల నుంచి ఉత్పరివర్తన చెందిన జన్యువులు వారసత్వంగా రావడం వల్ల అభివృద్ధి చెందే ఒక రకమైన రక్త రుగ్మత అని నిర్వాహకులు పేర్కొన్నారు. తలసేమియాను వారసత్వంగా పొందిన రక్త రుగ్మత తల్లిదండ్రుల నుంచి శిశువుకు బదిలీ చేయబడుతుందన్నారు. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ మొత్తాన్ని తగ్గిస్తుందన్నారు. తలసేమియా రోగులకు తరచూ వారి పరిస్థితిని బట్టి తప్పకుండా రక్త మార్పిడి అవసరం అవుతుందన్నారు. రక్త మార్పిడి ఆలస్యం అయితే లేదా సకాలంలో ఇవ్వకపోతే రోగులకు రక్తహీనత తీవ్రమవుతుందన్నారు. అవయవ నష్టం, వద్ధి, అభివద్ధి సమస్యలు, ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరగడం, జీవన నాణ్యత సరిగ్గా లేకపోవడం మొదలైనవి సంభవిస్తుందన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి సికిల్ సెల్ సొసైటీ వారు సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్, లతసురేష్‌గౌడ్, ఎస్ఎంఆర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఏసీఎఫ్ సభ్యులు వినయ్‌రెడ్డి, నదీమ్, సుధాకర్, నరేందర్‌బాబు, విజయ్ పద్మనాభన్, రాధాకృష్ణ, శ్రీకాంత్, సలినోలు, ప్రసాద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రదీప్, దీనదయాల్, భాస్కర్ రావు, శశిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి బలి

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఖేష్(40) కుటుంబ సభ్యులతో కలిసి ఎల్‌బీనగర్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. బండ్లగూడ ప్రాంతంలోని మహేష్ ఆయిల్‌మిల్ సమీపంలోని ఓ కన్‌స్ట్రక్షన్‌లో ముఖేష్ టైల్స్ మెస్త్రీగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చెట్లకొమ్మలు విరిగి కరెంటు తీగలపై పడటంతో కరెంటు తీగలు వర్షం నీళ్లలో పడ్డాయి. సాయంత్రం పని ముగించుకొని ముఖేష్ తన స్నేహితుడు మనోజ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై పల్లెచెరువు ప్రాంతం నుంచి వెళ్తున్నారు. వర్షంలో వెళ్తుండగా వరద నీరు ద్విచక్ర వాహనంలోకి వెళ్లి వాహనం ఆగిపోయింది. దీంతో నెట్టుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా నీళ్లలో పడిన కరెంటు తీగలకు తగిలి కిందపడిపోయాడు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

'జై సంవిధాన్'ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్

మణికొండ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని సోమవారం నుంచి మణికొండ మున్సిపాలిటీలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, దానిలో ప్రతి నాయకుడు, కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ అన్నారు. శనివారం సాయంత్రం పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయం పక్కన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని దాని విదానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర, నాయకులు రామకృష్ణారెడ్డి, యాలాల నరేష్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, ముత్యాలు, తాజుద్దీన్, శ్రీరాములు, సతీష్, బాల్‌రెడ్డి, నీలేశ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీనగర్ స్కూల్ హెచ్‌ఎంకు ఘనంగా వీడ్కోలు



హెచ్‌ఎంను సన్మానిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: నేతాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేగుంట బాలకృష్ణ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా దత్తు, జైపాల్‌ల సహకారంతో పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానం.. వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు మమత, మహేశ్వర్, లక్ష్మీ, యాదమ్మ తదితరులు హెచ్‌ఎం బాలకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సదానందం, జిల్లా సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు గోపాల్, మండల ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు టీఆర్‌టీవో సుదర్శన్ తదితరులు బాలకృష్ణ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... పాఠశాల నా జీవన యాత్రలో ఒక అద్భుతమైన భాగమన్నారు. ఎన్నో మధురానుభూతులతో ఇకపై జీవితాన్ని కొనసాగిస్తానన్నారు. కృష్ణగౌడ్, సుదర్శన్‌గౌడ్, దత్తు, జైపాల్, కృష్ణా, కుమార్‌యాదవ్, బాలాజీ, వెంకటేష్, క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ప్రధాన కార్యాదర్శి కొంపల్లి జగదీష్, సాంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, లావణ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాసే పార్టీలకు గుణపాఠం చెప్పాలి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు మండలంలోని కవ్వగూడ, నర్కూడలో శనివారం నవ సత్యాగ్రహ కార్యక్రమంలో భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో కవ్వగూడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కవ్వగూడ నుంచి నర్కూడ వరకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, ఇంచార్జి వినోద్ కుమార్, మండల ఇంచార్జి జానకిరామ్, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌ఓలో సత్తాచాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

మణికొండ: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్ఓ పోటీలో మణికొండ శ్రీ చైతన్య విద్యార్థులు తమ సత్తా చాటారు. అందులో ఇద్దరికి మొదటి బహుమతి, మరో ఇద్దరికి ద్వితీయ, ముగ్గురికి తృతీయ, ఇద్దరికి నాలగవ, ముగ్గురికి 5వ బహుమతి సాధించినట్టు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. వారికి బహుమతులతో పాటు గోల్డ్ మెడల్స్, మెరిట్ పత్రాలు అందించారన్నారు. వీరితో పాటు 50 మందికి కన్సోలేషన్, 150 మందికి మెరిట్ పత్రాలు సాధించారని ఆమె వివరించారు. దాంతో వారిని శనివారం పాఠశాలలో ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ అనిత, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీ, అకడమిక్ డీన్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారని ఆమె తెలిపారు.

వ్యర్థాలను తొలగించాలి



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఉదయం పాత కర్నూలు రోడ్డు, గగన్‌పహాడ్ ప్రాంతాల్లో నీటి స్తబ్దత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 15 రోజులుగా చాలా పూడికతీత వ్యర్థాలు పడి ఉన్నాయన్నారు. వెంటనే వాటిని తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి మహాసభలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

శంషాబాద్: భవన నిర్మాణ రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు... ఈ నెల 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్న మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరుకానున్నట్లు తెలిపారు. 21 తేదీన పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎంఎంఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం ఎంఎంఆర్ గార్డెన్‌లో జరిగే బహిరంగ సభకు వేలాదిగా కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు కె. రామస్వామి, సామిడి శేఖర్‌రెడ్డి, బాతురాజు నరసింహ, సీపీ మండల కార్యదర్శి నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేద్దాం



ఈవీవీ కాలనీ వాసులతో సమావేశమైన ఫెడరేషన్ నాయకులు

మణికొండ: కాలనీలలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేద్దామని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఈవీవీ కాలనీని సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పక్కనే ఉన్న నెక్నాంపూర్ చెరువులో దుర్గంధం, గుర్రపుడెక్క పెరిగిపోవటంతో దోమల సమస్య విపరీతంగా ఉందన్నారు. ఇష్టారాజ్యంగా బోర్లు వేయటం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయకపోవటంతో భూగర్భజలాలు తగ్గిపోతున్నాయన్నారు. తమ కాలనీ పరీవాహకంలో గుడిసెలు వేయటం, కాలుష్యం సమస్య ఉందన్నారు. కాలనీల్లో రోడ్ల మీద వాహనాలను నిలపటంతో రాకపోకలకు సమస్య ఏర్పడుతుందని, ట్యాంకర్లు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. ఇంటి పన్నులు అడ్డగోలుగా పెంచటంతో చెల్లించలేకపోతున్నామన్నారు. త్వరలోనే సదరు సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ తరపున అధికారుల దృష్టికి తీసుకుని వెలతామని అధ్యక్షుడు అన్నారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నీటి కష్టాలపై ఖాళీ కుండలతో ఆందోళన

- ధర్నా నిర్వహించిన బీజేపీ శ్రేణులు
- నీటి సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం
- పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజుభూపాల్ గౌడ్, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి



ఖాళీ కుండలతో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

రాజేంద్రనగర్: వేసవి ప్రారంభంలోనే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు మంచినీటి కష్టాలు పెరిగిపోతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజు భూపాల్ గౌడ్, పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రాజేంద్రనగర్ జలమండలి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లకు చెందిన పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఖాళీ కుండలతో కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ... నగరానికి మంచినీటిని అందించేందుకు సర్కిల్ ప్రాంతం గుండానే మంచినీరు వెళ్తున్నా.. సర్కిల్ ప్రజలకు మాత్రం రోజు విడిచి రోజు నీటిని అందించడం లేదని ఆరోపించారు. పేరుకు సర్కిల్‌లో రిజర్వాయర్‌లో ఉన్నా ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయని వెల్లడించారు. ప్రజలకు మంచినీటిని అందించే బదులు ట్యాంకర్ ద్వారా అమ్ముకుంటూ వ్యాపారం నిర్వహిస్తున్నారని వెల్లడించారు. డ్రైనేజీ వ్యవస్థ సైతం అస్తవ్యస్తంగా మారిందన్నారు. చిన్నపాటి మరమ్మతులు కూడా జలమండలి అధికారులు చేయడం లేదని ఆరోపించారు. తమ వద్ద డబ్బులు లేవని అధికారులు బాహాటంగా తెలుపుతున్నారని వెల్లడించారు. బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతుంటే స్థానికులు చెందా వేసుకొని మరమ్మతులు చేపట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వం రాజేంద్రనగర్ సర్కిల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ మరింత ఉధృతంగా ఉద్యమం ముందుకు తీసుకెళుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రంగారెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, అన్నపురెడ్డి భీమార్జున్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ మల్లా రెడ్డి, టి.అంజన్ కుమార్, నేతలు కొమురయ్య, కార్పొరేటర్ మొండ్రా సంగీత, కోరని దయానంద్, భీమార్జున్ రెడ్డి, మహాలింగం గౌడ్, బొక్క బాల్ రెడ్డి, ఎస్. విజయ్ కుమార్, కాడెం సుధాకర్, జోగి రవి, రాచూరి రాజశేఖర్, సోల్కర్ రెడ్డి, ఎస్.జగన్, డి.లక్ష్మీనారాయణ, అడికె రాజు, సత్యనారాయణ, జి.బాబురావు, అడికె జనార్దన్, సులిగె వెంకటేష్, కిరణ్‌చారి, నాగేష్ యాదవ్, హరికిషన్‌జీ, రవికాంత్‌రెడ్డి, ఎస్.విఠల్ తదితరులు పాల్గొన్నారు.